ఈ ప్రభుత్వంలో మందుల కంటే మందే పుష్కలం

34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: కూటమి ప్రభుత్వ పాలనలో పీహెచ్‌సీల్లో మందులు దొరకటంలేదు కాని వీధుల్లో మందు మాత్రం విచ్చలవిడిగా దొరుకుతుందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం 45వ పోలింగ్ బూత్ పరిధిలో జరిగింది. హాజరైన పద్మావతి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చంద్రబాబు మోసం గురించి పార్టీ నాయకులతో కలిసి ప్రజలకు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని మందులు పుష్కలంగా దొరికేవన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మందులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీధుల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం మాత్రం ఏ సమయంలో అయిన దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండ రమణ, చౌల్ట్రీ మాజీ చైర్మన్, పార్టీ వార్డు సీనియర్ నాయకులు లింగం శ్రీను, 45వ బూత్ కమిటీ అధ్యక్షుడు అనిల్, అనురాధ, గాలి పార్వతి, రాజేష్, శివారెడ్డి, రాజు, సత్తిరాజు, సంతోష్, శ్రీను, మీరా, రామచంద్రరావు, వెంకటరమణ, అప్పలరాజు, గోవింద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



34వ వార్డులో బాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న తోట పద్మావతి తదితరులు

32వ వార్డులో..

32వ వార్డు అధ్యక్షుడు పినింట్ల రాజారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు గడప గడపకు వెళ్లి బాబు ఎన్నికల మోసాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కొణతాల కృష్ణవేణి, బొడ్డేటి కిషోర్, విశ్వనాథ్, బైరెడ్డి, తాటిపూడి రవి, మురళి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

33వ వార్డులో..

33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో కొల్లువారివీధిలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసం గురించి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, హేమ, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, కొల్లు సత్యవతి, లక్ష్మీకాంతం, ధర్మ, ఈశ్వరరావు, చోడిపల్లి శివకుమార్, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బూర్ల చిన్న, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, పాల దామోదరరావు, జి.కొండలరావు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



33వ వార్డులో ప్రచారం చేస్తున్న ముత్తాబత్తుల రమేష్ తదితరులు



పండావీధిలో ప్రచారం చేస్తున్న 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి తదితరులు

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి 82వ బూత్ పండావీధిలో కార్యకర్తలతో కలిసి బాబు మోసపూరిత హామీల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ క్యాక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సువార్తరాజు, సౌత్ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు మళ్ల బుజ్జి, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, బత్తులరాము, యళ్ల రమణమ్మ, నాగిరెడ్డి, శేఖర్, పోలవరపు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ

అల్లిపురం: ర్యాగింగ్ ఓ విష సంస్కృతి అని, ర్యాగింగ్‌కు పాల్పడినా.. ఈవ్ టీజింగ్ చేసినా నేరమని, దీనికి దూరంగా ఉండాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. కళాశాలల్లో ఇవి సహజమంటూ తేలిగ్గా తీసుకుంటే దుష్ఫలితాలు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. యాంటీ ర్యాగింగ్ వీక్ సందర్భంగా ఏవీఎన్ కాలేజ్ ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు సమన్వయంతో, వన్‌టౌన్ సీఐ జి.డి.బాబు ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి పోలీస్ కమిషనర్ ర్యాలీతో కలిసి నడుస్తూ 'ర్యాగింగ్ వద్దు–చదివే ముద్దు', 'ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు' వంటూ నినాదాలు అందించారు. ర్యాలీ ఏవీఎన్ కాలేజీ వద్ద ప్రారంభమై, కలెక్టరేట్, జగదాంబ జంక్షన్, పూర్ణా మార్కెట్ మీదుగా తిరిగి కాలేజీ వరకు కొనసాగింది.కార్యక్రమంలో డీసీపీ జోన్–2 మేరీ ప్రశాంతి, హార్బర్ ఏసీపీ కాళిదాసు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్

కంచరపాలెం: జిల్లాస్థాయిలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో గెలుపొందిన స్టార్ స్పోర్ట్స్ ఫుట్‌బాల్ టీమ్‌ను జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ అభినందించారు. ఈ మేరకు మంగళవారం వారి చేతుల మీదుగా ట్రోఫీ తీసుకున్న క్రీడాకారులు కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు సాధిస్తామని కెప్టెన్ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్‌లు మాట్లాడుతూ క్రీడారంగంలో జ్ఞానాపురానికి ఎప్పటి నుంచో మంచి పేరు ఉందని, దానిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే క్రీడాకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సాగర్‌కుమార్, పవన్, డేవిడ్, నవీన్, రాజేష్, పరమేశ్వరరావు, కిషోర్, చంద్రశేఖర్, ప్రభాకర్, రూపేష్, యువరాజ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రశంసలు



తులసిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, అధ్యాపకులు

దాబాగార్డెన్స్: ఆర్‌టీఐ యాక్ట్–2025పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎస్.తులసిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల, అధ్యాపకులు డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ టీఎంఏ నివేదిత, డాక్టర్ ఎ.హైమావతి, పలువురు అధ్యాపకులు అభినందించారు. కళాశాల పేరు ప్రతిష్టతలు మరింత ఎత్తుకు తీసుకెళ్లిన తులసి భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు. ఈ విజయం సాధించడానికి తులసి కృషి, శ్రమ, ప్రదర్శించిన నైపుణ్యం ప్రతి ఒక్కరికీ ప్రేరణనిస్తుందన్నారు.

రామ్‌ప్రసాద్ నియామకం పట్ల హర్షం

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బుచ్చి రామ్‌ప్రసాద్‌ను నియమించడం పట్ల టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి, విశాఖ పార్లమెంట్ కన్వీనర్ వంగూరి గణేష్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి ఆమోదంతో విడుదలైన నామినేటెడ్ పదవుల ప్రకటనలో బ్రాహ్మణ కార్పొరేషన్ కూడా ఉండడం హర్షణీయం అన్నారు. బ్రాహ్మణుల శ్రేయస్సు కోసం పని చేస్తున్న రామ్ ప్రసాద్ కృషికి తగిన గుర్తింపు లభించిందన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బుచ్చి రామ్‌ప్రసాద్ నియామకం పట్ల ఎస్‌వీ ఇన్ఫో హెల్ప్‌లైన్ సర్వీసెస్ సీఈవో శాయిరామ్ సీవీఎస్, అఖిల భారత శ్రీవైష్ణవ బ్రాహ్మణ సంఘం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ ఐక్య వేదిక తదితర సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

మేయర్‌ను సత్కరించిన స్థాయీ సంఘం సభ్యులు

దాబాగార్డెన్స్: ఇటీవల నూతనంగా ఎన్నికైన జీవీఎంసీ స్థాయీ సంఘం సభ్యులు మంగళవారం మేయర్ పీలా శ్రీనివాసరావును పెందుర్తి మేయర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థాయీ సంఘం సభ్యులు విశాఖ నగరాభివృద్ధికి కృషి చేయాలని, స్థాయీ సంఘంలో ప్రతి అంశం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ చర్చ జరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు కొణతాల నీలిమ, గంకల కవిత, దాడి వెంకట రామేశ్వరరావు, సేనాపతి వసంత, గేదెల లావణ్య, రాపర్తి త్రివేణి వరప్రసాద్, మాదంశెట్టి చినతల్లి, మొల్లి ముత్యాలు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి పథకం అమలుపై సమీక్ష

దాబాగార్డెన్స్: ఈ నెల 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న స్త్రీ శక్తి పథకంపై జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు మంగళవారం తన చాంబర్‌లో డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. బస్సుల కండీషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ రద్దీపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ సీటీఎం పద్మావతి, పర్సనల్ ఆఫీసర్ తిరుపతి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ గంగాధర్, పలువురు డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం

అల్లిపురం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి యు. నాగరాజు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదొరలను తరిమికొట్టేందుకు ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భవించిందన్నారు. నేటికి 90 సంవత్సరాలు కావస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు పి. శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీను, ఉపాధ్యక్షుడు జె. అభిషేక్, సహాయ కార్యదర్శి హేమానంద్, మౌనిక, కోశాధికారి భవానీ, కార్యవర్గ సభ్యులు గ్రేస్ ప్రకాష్, శివరాజ్ కుమార్, యూనివర్సిటీ విద్యార్థులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్‌ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

మహారాణిపేట: వార్డు పరిపాలనా కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీజే గణేష్ కుమార్ కోరారు. మంగళవారం జీవీఎంసీ రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గత నెల 30న విడుదలైన తాత్కాలిక సీనియారిటీ జాబితాలో హాల్ టికెట్ నంబర్లు, ర్యాంకులు, మార్కుల్లో ఉన్న తప్పులను సరిచేసి కచ్చితమైన మెరిట్–కమ్–సీనియారిటీ జాబితాను ప్రకటించాలని కోరారు. ఫీల్డ్ స్థాయి సూచనలను చేర్చేలా యూనిఫైడ్ సర్వీస్ రూల్స్‌పై ఇంటరాక్టివ్ సమావేశం నిర్వహించాలన్నారు. తరచుగా జరుగుతున్న డోర్–టు–డోర్ సర్వేలు సిబ్బందికి ఒత్తిడి, ప్రజల్లో అసంతృప్తి కలిగిస్తున్నాయని తెలిపారు. రెవెన్యూ డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర ట్రెజరర్ చింతకాయల బంగారురాజు, జిల్లా నాయకులు ఎస్. సాయికృష్ణ, డి. రవితేజ, ఎస్. నానాజీ తదితరులు ఉన్నారు.



జీవీఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గణేష్‌కుమార్ తదితరులు

మిట్టల్‌కు ఊడిగం చేయడం ఆపండి

ఎంపీలపై సీపీఎం నేతల మండిపాటు

బీచ్‌రోడ్డు: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని నోరు తెరిచి అడగలేని ఎంపీ శ్రీభరత్ తదితరుల బృందం అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు కాబోయే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ఎన్‌ఎండీసీ నుండి గనుల కేటాయింపు, ఇతర అనుమతులు వేగవంతం చేయాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామికి విన్నవించడం సిగ్గు చేటు అని సీపీఎం నాయకులు మండిపడ్డారు. ఇది విశాఖ ఉక్కుకు ద్రోహం, మిట్టల్‌కు ఊడిగం చేసే చర్య అని దుయ్యబట్టారు. దీనిని నిరసిస్తూ మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు మాట్లాడుతూ దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం సొంత గనులు కేటాయించింది అన్నారు. కేవలం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై మాత్రమే వివక్ష చూపి గనులు కేటాయించలేదన్నారు. దీనివల్ల ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి నాలుగు నుండి రూ. 6 వేల అదనపు భారం సంస్థపై పడుతుందన్నారు. తమకు అధికారమిస్తే విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించి, ప్లాంటును లాభాల బాట పట్టిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారని.. ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే ఇప్పుడు ఆ విషయం మాట్లాడడం లేదన్నారు. రాష్ట్ర ప్రజల కన్నా మిట్టల్ ముఖ్యమైతే ఎంపీలు తమ పదవులకు రాజీనామాలు చేసి మళ్లీ ప్రజా తీర్పు కోరాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. జగన్, వి. కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, పి. మణి, జిల్లా కమిటీ నాయకులు ఎం. సుబ్బారావు, యు.ఎస్.ఎన్. రాజు, వై. రాజు, జీవీఎన్ చలపతి, జి. అప్పారావు, పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

23 నుంచి ఒంగోలులో సీపీఐ రాష్ట్ర మహాసభలు



మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అల్లిపురం: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు జరుగనున్నట్టు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్.కె రెహమాన్ తెలిపారు. ఈ సభల్లో విశాఖ జిల్లా సమగ్ర అభివృద్ధి, పార్టీ చేపట్టాల్సిన చర్యలపై చర్చించి, పోరాటాలను ఉధృతం చేయనున్నామన్నారు. మంగళవారం అల్లిపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇష్టమొచ్చినట్టు ప్రభుత్వ భూములను పంచుతోందని ఆరోపించారు. నగరంలో వేల కోట్ల విలువైన బీచ్ రోడ్డులోని 14 ఎకరాల భూమిని లూలూకు ఇవ్వడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. తక్షణమే లూలూకు ఇచ్చిన భూమి ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా విశాఖ నగరాభివృద్ధికి ఎటువంటి ప్రణాళికలు రూపొందించలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు కె. సత్యనారాయణ, పి. చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. పైడిరాజు, కె. సత్యాంజనేయ, సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి, కె.వనజాక్షి, ఎస్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే చిన్నారుల్లో ఎదుగుదల

అల్లిపురం: నులిపురుగుల వల్ల కలిగే అనారోగ్య సమస్యల నివారణకు కేంద్ర ప్రభుత్వం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తుందని, వాటి నివారణతోనే చిన్నారుల ఎదుగుదల బాగుంటుందని కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అక్షా పర్వీన్ అన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల మోడల్ స్కూల్‌లోను, స్ప్రింగ్‌రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులతో డీవార్మింగ్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు అంగన్‌వాడీ కార్యకర్త రాణిపుష్ప వల్లీ, ఏఎన్ఎంలు ధనలక్ష్మి, ప్రభావతి, ఆశ వర్కర్లు లీలావతి, సరోజ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలివ్వాలి

దాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15 నుంచి అమలు చేసేందుకు చూస్తున్న మహిళలకు ఉచిత బస్సు పథకం గురించి పునఃపరిశీలన చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ద్వారకానగర్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆదాయం కోల్పోయే ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఆదాయం చూపించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో ఆటో డ్రైవర్లకు ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలని, వాహనమిత్ర రూ.15 వేలు విడుదల చేయాలని, జీవో 21 రద్దు చేసి డ్రైవర్లకు జీవించే హక్కు కల్పించాలన్నారు. ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జాతీయ బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి రుణాలు మంజూరు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో యు. శివాజీ, కె.దేవుడు, రవికృష్ణ, రాజు, బి.నూకరాజు, పి.అప్పలరాజు, శ్రీనివాస్, కె.రాము, కె.వెంకటేష్, పీపీ శివాజీ, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

15 నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

దాబాగార్డెన్స్ : ఇస్కాన్ సాగర్‌నగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈనెల 15వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఇస్కాన్ సాగర్ నగర్ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ డాక్టర్ నితాయి సేవిని తెలిపారు. ఈ మేరకు మంగళవారం జన్మాష్టమి వేడుకల పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో 15న సోలో డ్యాన్స్ పోటీలు, మాయాపూర్ భక్త బృందంచే భజన, కృష్ణలీల తెలుగు ప్రవచనం, 16న శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని మంగళహారతి, దర్శన హారతి, అఖండ హరినామ సంకీర్తన, 17న దర్శన హారతి, ప్రభుపాద లీలామృతం, నందోత్సవం ఉంటాయన్నారు. సమావేశంలో ఫెస్టివల్ కో ఆర్డినేటర్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో..

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు ఈ నెల 15, 16, 17 తేదీల్లో ఎంవీపీ కాలనీ గాదిరాజు ప్యాలస్ వద్ద, గంభీరం గ్రామంలోని హరేకృష్ణ వైకుంఠం వద్ద వైభవంగా నిర్వహించనున్నట్టు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస పేర్కొన్నారు. పలు కార్యక్రమాలు, పోటీలు ఉంటాయని, పాల్గొనదలచే వారు 9010611108 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

కంచరవీధి సమస్యలపై దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

దాబాగార్డెన్స్: సాక్షి కథనానికి వన్‌టౌన్ పోలీసులు స్పందించారు. 'భయం భయం' పేరిట సాక్షి సోమవారం ప్రచురించిన కథనానికి వన్‌టౌన్ సీఐ జీడీ బాబు నేతృత్వంలో పలువురు పోలీస్ సిబ్బంది స్పందించారు. కంచరవీధిలో మందుబాబులు, గంజాయి బ్యాచ్‌ల హల్చల్.. దొంగల స్వైర విహారంతో భయాందోళనలతో గడుపుతున్నా పట్టించుకోని పోలీసులంటూ రాసిన కథనానికి పెద్ద ఎత్తున పోలీసులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న నేరాలు.. ఘోరాలపై ఆరా తీశారు. స్థానిక మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి పోలీసుల దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. సీఐ జీడీ బాబు స్పందించి స్థానికంగా ఉన్న పలువురితో 'పీస్'పేరిట ఓ కమిటీ వేశారు. శాంతియుత వాతావరణం కల్పించే ఉద్దేశమై ఈ కమిటీని వేసినట్టు స్థానికులు సాక్షికి తెలిపారు. సాక్షి ప్రచురించిన కథనానికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



కంచరవీధి స్థానికులతో వన్‌టౌన్ పోలీసులు

కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి

బీచ్‌రోడ్: విశాఖ డెయిరీలో తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులు 305 మందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే ఈ పోరాటం ఆగదని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్వీ కుమార్ అన్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటల నుండి మంగళవారం ఉదయం 10 గంటల వరకు నిర్వహించిన దీక్షలో ఆయన పాల్గొన్నారు. కార్మికుల ఓట్లతో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ కార్మికులను పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్ కుమార్ ఎటువంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం శోచనీయమన్నారు. సీపీఎం పార్టీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యం మెడలు వంచి కార్మికులంతా విధులకు వెళ్తారని, వారికి తాను అండగా ఉంటానని తెలిపారు. దీక్షలో పాల్గొన్న కార్మికులకు నిమ్మ రసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కో కన్వీనర్ కుమార మంగళం, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. సుబ్బన్న, జిల్లా ముఠా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. సుబ్బారావు, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకుడు గుర్రం రమణ, మున్సిపల్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్ రెడ్డి, బీహెచ్ఈఎల్ అధ్యక్షుడు జి.టి. ప్రకాష్, విజయ్ కుమార్, జగన్నాథం, జోతీశ్వరరావు, బి. జగన్, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ పి. మణి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల పైనే పశువులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు రామకృష్ణా జంక్షన్, రైతుబజార్, జనతాబజార్, పోర్టు దరి నాలుగు చిలుకలు, పూర్ణామార్కెట్ ప్రాంతాల్లో పశువులు వినియోగదారులు, వాహన చోదకులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. నూనెమిల్లువీధి, పోర్టు దరి నాలుగు చిలుకల వద్ద ఉన్న కొందరు పశువుల యాజమానులు రోడ్లపైకి తమ పశువులను వదిలేయడంతో అవి మార్కెట్లు, రహదారులపై సంచరిస్తున్నాయి. జీవీఎంసీ జోన్–4లో పశు వైద్యాధికారులు గతంలో రహదారులపై ఉన్న ఆవులను పట్టుకుని జూ వద్ద విడిచిపెట్టేవారు. వాటి యజమానులు అపరాధ రుసుము చెల్లించి విడిపించుకునేవారు. తర్వాత తమ పశువులను ఇంటి వద్దే కట్టుకునే వారు. ప్రస్తుతం అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో పశువులు రహదారుల పైకి వచ్చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రామకృష్ణా జంక్షన్ వద్ద రహదారికి అడ్డంగా ఉన్న ఆవులు

బుల్స్‌పై రాయల్స్ విజయం

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ 3 వికెట్ల తేడాతో భీమవరం బుల్స్‌పై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బుల్స్ 4 వికెట్లు కోల్పోయి 191 పరుగులు చేసింది. బ్యాటింగ్‌లో హిమకర్ (81), రేవంత్ (69) రాణించారు. ప్రతిగా రాయల్స్ మరో రెండు బంతులుండగానే ఏడు వికెట్లు కోల్పోయి 193 పరుగులు చేసి విజయాన్నందుకుంది. కెప్టెన్ హనుమవిహారి (37), పాండురంగరాజు (20), రాహుల్(52), విజయ్(36), అయ్యప్ప(26) రాణించారు.

గర్జించిన వైజాగ్ లయన్స్

మరో మ్యాచ్‌లో వైజాగ్ లయన్స్ జట్టు విజయవాడ సన్‌షైనర్స్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో విజయకేతనం ఎగురవేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ 8 వికెట్లకు 185 పరుగులు చేసింది. కెప్టెన్ అశ్విన్‌హెబ్బార్(30), అభినవ్(29), తేజ(33), కెఎస్ఎన్ రాజు(53) రాణించారు. యశ్వంత్ 4 వికెట్లు, సాయితేజ రెండు వికెట్లు తీశారు. ప్రతిగా వైజాగ్ లయన్స్ వీరారెడ్డి(104) సెంచరీతోను, రికీబుయ్(58)అర్ధసెంచరీతో రాణించి విజయతీరాలకు చేర్చారు.

ఘనంగా జాతీయ లైబ్రేరియన్ దినోత్సవం

దాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్‌లో ఉన్న ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం జాతీయ లైబ్రేరియన్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాలల ఉత్తరాంధ్ర రీజినల్ మేనేజర్ పి.రామకృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ కడారికుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జీ, గ్రంథాలయ అధికారి కె.రాంబాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.శ్రీనివాసరెడ్డి పాల్గొని గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర డాక్టర్ బీఈవీఎల్ నాయుడు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ బాబ్జీ, గ్రంథాలయ అధికారి కె.రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.